క్లుప్తంగా

గద్దర్‌కు ఘన నివాళి



కవి మాణిక్యం ఇషాక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని అక్షయ జూనియర్ కళాశాలలో ఆదివారం దివంగత ప్రజా గాయకుడు గద్దర్‌కు పలువురు కవులు ఘనంగా అక్షర నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవులు గద్దర్‌పై కవితా గానం చేశారు. కవితా గానం చేసిన కవి మాణిక్యం ఇషాక్ తదితరులను సన్మానించారు. దాదాపు 25 మంది కవులు ఈ కార్యక్రమంలో పాల్గొని గద్దర్‌కు అక్షర నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్, సీనియర్ న్యాయవాది మెళవాయి గోవిందరెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, కార్యదర్శి శివన్న, డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు, ముస్లిం నగారా అధ్యక్షుడు ఉమర్‌ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

25న వైసీ తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణ

మడకశిర: మడకశిరలోని వైబీ హళ్లి సర్కిల్‌లో ఈనెల 25న మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ వైసీ తిమ్మారెడ్డి విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరిస్తారని మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు, టీటీడీ బోర్డు మెంబర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వస్తువుల ప్రదర్శనకు తరలివచ్చిన భక్తులు



మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన వస్తువులను చూసేందుకు వచ్చిన భక్తులు

పెనుకొండ: పట్టణంలోని బాబయ్య దర్గా సమీపంలోని దివాన్ ఖానాలో మహమ్మద్ ప్రవక్త వంశీకులకు చెందిన విలువైన వస్తువులను ప్రదర్శించారు. బాబయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 10 గంటల నుంచి మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన కేశాలు, తలపాగ, ఇతర విలువైన వస్తువులను ప్రదర్శించారు. వేలాది మంది భక్తులు వస్తువలను తిలకించేందుకు తరలివచ్చారు.

వివాహానికి విచ్చేయండి



దీపిక దంపతులకు వివాహ పత్రిక అందజేస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్

హిందూపురం: తన సోదరుడి కుమార్తె వివాహ వేడుకకు విచ్చేయాలని హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, వేణురెడ్డి దంపతులకు హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ వివాహ ఆహ్వాన పత్రికను అందించారు. ఈనెల 21న కర్నూలులోని జీఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో పెళ్లి నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, నక్కలపల్లి శ్రీరాంరెడ్డి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

'గడప గడపకూ' వాయిదా

రొద్దం: మండల పరిధిలోని కంబాలపల్లి, బీదానిపల్లి గ్రామాల్లో సోమవారం జరగాల్సిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వాయిదా పడినట్లు ఎంపీపీ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోండి



క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం: క్రీడలతో ఉత్సాహం చురుకుదనంతో పాటు పోటీతత్వం పెరిగి జీవితంలో ఎదగడానికి దోహదపడతాయని మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి అన్నారు. స్థానిక ఎంజీఎం గ్రౌండ్‌లో వైఎస్సార్ వార్డు వలంటీర్ క్రికెట్ ఫైనల్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. రహమత్‌పురం వలంటీర్స్ జట్టు మొదట బ్యాటింగ్ చేసింది. 12 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఆబాద్‌పేట్ గోల్డెన్‌ఫ్రెండ్స్ వలంటీర్ల జట్టు 9 వికెట్ల నష్టానికి 78 పరుగులు మాత్రమే చేసింది.గెలుపొందిన జట్లకు సోమవారం బహుమతులను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, కౌన్సిలర్లు రామచంద్ర, నాయకులు శ్రీరాంరెడ్డి, సిపిసి బాషా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

సోమందేపల్లి: పెనుకొండ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చిన్న పీర్ల పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగానే సోమందేపల్లి మండలంలోని చాలకూరు గ్రామంలో ఆదివారం జలధి ఉత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్తులు పీర్ల స్వాములను భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. అగ్ని గుండం వద్ద పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా అలావ్ ఆడారు. ముల్లా సాబ్ షఫీ పీర్ల చావిడి వద్ద చక్కెర చదివింపులు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఐ విజయ్‌కుమార్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో మొహర్రం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక ప్రార్థనలు, చక్కర చదివింపులు చేశారు. సాయంత్రం అగ్ని గుండం చుట్టూ అలావ్ ఆడుతూ చూపర్లను ఆకట్టుకున్నారు. అనంతరం కుళ్లాయిస్వామి పీర్లను స్థానిక చెరువులోకి జలధికి తరలించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హిందూపురం: పట్టణంలో చిన్న పీర్ల పండుగను పురస్కరించుకుని చౌడేశ్వరీ కాలనీలో ఆదివారం పీర్ల జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి పీర్ల చావడి వద్దకు భక్తులు తరలివెళ్లి చదివింపులు చేసి ప్రార్థనలు చేశారు. అలాగే భక్తులకు చెక్కెర, లడ్డూలను పంచిపెట్టారు. సాయంత్రం పీర్ల చావడి వద్ద పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పీర్లు అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఊరేగించారు. ఈ సందర్భంగా 2వ వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్ ప్రజలకు అన్నదానం చేశారు. అనంతరం కొట్నూరు చెరువు సమీపంలో జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు.



రొద్దం: తురకలాపట్నంలో జలధికి తరలుతున్న పీర్ల స్వాములు



హిందూపురం: చౌడేశ్వరీకాలనీలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



సోమందేపల్లి: అలావ్ ఆడుతున్న గ్రామస్తులు



రొద్దం: జలధి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



సోమందేపల్లి: మకాన్ వద్ద ప్రార్థలు చేస్తున్న దృశ్యం

శ్రీరామరెడ్డికి ఘన నివాళి



శ్రీరామరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న రఘువీరారెడ్డి, తదితరులు

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ స్వర్గీయ శ్రీరామరెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామరెడ్డి సమాధి దగ్గర మాజీ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు

రొద్దం: మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నాగస్వామి చెప్పారు. ఆదివారం మండల పరిధిలోని పావగడ–పెనుకొండ ప్రధాన రహదారిపై వివిధ వాహనాలను ఎస్‌ఐ తనిఖీ చేశారు. మైనర్లు డ్రైవింగ్ చేయకుండా వారి తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

అగళి: 'కుల,మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తూ ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మళ్లీ సీఎంగా చేసుకుందాం. జగనన్న సీఎంగా ఉంటేనే పేదలకు భరోసా' అని ఎమ్మెల్యే తిప్పేస్వామి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కోమరేపల్లి పంచాయతీలోని కరిదసనపల్లి గ్రామంలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూనే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, రావుడి ఆంజనేయస్వామి దేవాలయనికి రోడ్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు ప్రజలు విన్నవించారు. నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే తిప్పేస్వామి సూచించారు.

సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతం హామీలను అమలు చేశారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యమిచ్చి ప్రొత్సహిస్తున్నారని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సచివాలయం అధికారులకు తెలిపి వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్ర కుమార్, రాష్ట్ర కుంచిటి వక్కలిగ డైరెక్టర్ గగన, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహేంద్రప్ప, కోమరేపల్లి సర్పంచ్ సుజతమ్మ, రావుడి ఎంపీటీసీ నింగమ్మ, పంచాయతీ కార్యదర్శి శోక, సర్పంచులు శివకుమార్, బసవరాజు, జేసీఎస్ కన్వీనర్ శివన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రప్ప, కామరాజు, బసవరాజు, రామ్మన్న, లింగరాజు, హేమంతరాజు, మంజునాథ్, నాటరాజు, నాగేంద్ర, డీలర్ నాగేంద్ర, ఆలుడి డీలర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కరిదసనపల్లిలో గడప గడపకూ కార్యక్రమంలో సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

సీఎం వైఎస్ జగన్ మహిళా పక్షపాతి



మహిళలకు భోజనాలను వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక అన్నారు. మహిళాభ్యున్నతికి, సాధికారతకు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వాల్మీకి నరేష్ ఆధ్వర్యంలో మోడల్‌కాలనీ సమీపంలోని శ్రీనివాస వాటర్ ప్లాంట్‌లో ఆదివారం మహిళలతో మాటా మంతీ, సహపంక్తి భోజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి సమన్వయకర్త దీపిక, వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి, బాబురెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు, బీసీలు, మైనార్టీల అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నామినేటెడ్ పదవుల్లో సైతం అత్యధిక శాతం బీసీలకు, అందులోనూ మహిళలకు అవకాశం కల్పించారన్నారు. బీసీ వర్గానికి చెందిన మహిళనైనా తనకు గొప్ప అవకాశం కల్పించారన్నారు. అనంతరం ఆమె మహిళలతో ముచ్చటించారు. వారి సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు తాను ఎప్పుడు అండగా ఉంటానని చెప్పారు. అనంతరం మహిళలతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆసీఫ్, శివ, రామచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన సబ్‌స్టేషన్

- రూ.4 కోట్లతో నిర్మాణం పూర్తి

అగళి: మండల పరిధిలోని రామనపల్లి సమీపంలో రూ.4 కోట్లతో నిధులతో నిర్మించిన 33.11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ నెలలోనే ప్రారంభించేందుకు విద్యుత్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో దాదాపు 15 గ్రామాలకు పైగా ప్రజలకు ఇకపై ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉండవని చెబుతున్నారు. మండల వ్యాప్తంగా వ్యవసాయ రంగానికి సంబంధించి 3,800 వరకు విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. అలాగే 14,500 పైగా గృహ విద్యుత్ వినియోగదారుల సర్వీసులు ఉన్నాయి. 350 ప్రభుత్వ కార్యాలయల విద్యుత్ సరీస్వులు ఉన్నాయి. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభంతో అటు రైతులు, ఇటు గృహ వినియోగదారులకు విద్యుత్ సమస్య అనేది ఉండదని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల కష్టలను గుర్తించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లోఓల్టేజీ, ఇతర విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవడంపై ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రామనపల్లి విద్యుత్ సబ్ స్టేషన్

నేతల విగ్రహాలకు రంగులు



నెహ్రూ విగ్రహానికి మెరుగులు దిద్దుతున్న దృశ్యం

హిందూపురం అర్బన్: పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకొని హిందూపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హనుమంతరాయప్ప సహకారంతో ఆదివారం పట్టణంలోని నెహ్రూ, ఇందిరాగాంధీ విగ్రహాలకు రంగులు వేయించారు.

సత్యసాయి చిత్రపటం ఊరేగింపు



సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

అగళి: మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి బాబా 98వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగించారు. గ్రామ సంకీర్తన, సత్యసాయి ప్రశాంతి పతాకావిష్కరణ, జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు.

నేడు 'స్పందన '

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ తెలిపారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి అన్ని సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్ తెలిపారు.

వక్కలిగలను ఓబీసీ జాబితాలో చేర్చాలి

మడకశిర/రొళ్ల: వెనుకబడిన కుంచిటి వక్కలిగ కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చి ఉద్యోగ, రాజకీయ ఇతరాత్ర వాటిలో అవకాశం కల్పించి ఆదుకోవాలని తాలూకా కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు అనంతరాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కర్ణాటక రాష్ట్ర తుమకూరు పట్టణంలోని కుంచశ్రీ ప్యాలెస్ ఆవరణలో జిల్లా స్థాయి అఖిల కుంచిటి వక్కలిగ మహా మండలి, కుంచిటి వక్కలిగ విద్యాభివృద్ధి ఆధ్వర్యంలో కుంచిటి వక్కలిగ ఓబీజీ హక్కుల సాధన కోసం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మడకశిర నియోజకవర్గానికి చెందిన కుంచిటి వక్కలిగలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మడకశిర నియోజకవర్గంలోని కుంచిటి వక్కలిగలను కూడా ఓబీసీలుగా గుర్తించాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా దిశా నిర్దేశంపై చర్చించారు. కార్యక్రమంలో విశేష గౌరవాధ్యక్షులు నాగరాజు, మాజీ గౌరవాధ్యక్షులు కాంతరాజు, డైరెక్టర్లు బి.కాంతరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న తాలూకా కుంచిటి వక్కలిగ సంఘం నాయకులు

నవోదయలో 'నా భూమి- నాదేశం'



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 'నా భూమి – నా దేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జాతీయ పతాకం ఎగర వేయడంతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు మట్టి మీద తమకున్న ప్రేమను తెలియజేస్తు ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ ఎం.నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ వి.నాగరాజన్, ఎన్‌సీసీ అధికారులు షేక్ ఆసఫ్‌అలీ, ఆర్.అంబురాజన్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా డ్రైనేజీ పనులు

అమరాపురం: మండలంలోని ఆలదపల్లి గ్రామ సచివాలయం వద్ద డ్రైనేజీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లా పరిషత్ సభ్యుల నిధులతో పనులను చేపట్టారు. పనులు ఏ విధంగా జరుగుతున్నాయో జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క ఆదివారం పరిశీలించారు. స్థానిక సర్పంచ్ గిరిజమ్మ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. పనులు నాణ్యంగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

హిందూపురం: ముద్దిరెడ్డిపల్లిలోని 38వవార్డు పూజమ్మ గుడి వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగార్జున తల్లి ఆదిలక్ష్మమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి ముద్దిరెడ్డిపల్లికి వెళ్లి నివాళులర్పించారు.

అలాగే రెండురోజుల క్రితం 38వ వార్డులోని చేనేత వ్యాపారస్తుడు పల్లా లక్ష్మీనారాయణ సతీమణి పల్లా జయభారతమ్మ చనిపోయారు. ఇందులో భాగంగానే లక్ష్మీ నారాయణ కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. తర్వాత బీజేపీ నాయకుడు సురువు రామాంజినేయులు కుమారుడు ప్రకాష్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని వారి స్వగృహానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

యువకుడికి గాయాలు



గాయపడిన యువకుడు ఇనాయతుల్లా

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని క్రీస్తు జ్యోతి పాఠశాల సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇనాయతుల్లా అనే యువకుడు గాయపడ్డాడు. యువకుడి కాళ్లకు తీవ్ర గాయాలుకాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య



చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న వెంకటేష్

చిలమత్తూరు: మండలంలోని చిన్నపరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డే మేకల వెంకటేష్ (38) కోడూరు మఠ్రో తోపులోని జెడ్పీహెచ్‌ఎస్‌లో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ శ్రీనివాసులు వివరాల మేరకు... మృతుడు వెంకటేష్ ఆరు నెలలుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండేవాడన్నారు. ఆస్పత్రుల చుట్టూ తిరిగినా నొప్పి తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి పాఠశాలలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

షూటింగ్ ప్రారంభం



చిత్రీకరణను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి

మడకశిరరూరల్: మాస్ మహాస్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న బ్లైండ్ అటాక్ వైల్డ్ అనే ద్విభాషా లఘు చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఆదివారం నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి చేతుల మీదుగా చిత్రీకరణను ప్రారంభించారు. కార్యక్రమంలో నటీనటులు సునామి, శివ, శివు, ఈరన్న, భూతరాజు, రాజు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు

పెనుకొండ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన క్రికెట్ పోటీలు జరిగాయి. యూటీఎఫ్ నేతృత్వంలో సాగిన పోటీల్లో పలువురు ఉపాధ్యయులు పాల్గొన్నారు.

ప్రచారం ముమ్మరం



నరసింహప్పకు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

గోరంట్ల: మండల కేంద్రంలోని 18వ వార్డుకు వార్డు మెంబర్‌గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడిగా పోటీ చేస్తున్న గొల్ల నరసింహప్ప విజయం కోసం ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో తిప్పారాజుపల్లి, శింగిరెడ్డిపల్లి గ్రామాల్లో నాయకులు ఇంటింటికీ వెళ్లి నరసింహప్పకు ఓటేయాలని అభ్యర్థించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

హిందూపురం అర్బన్: ఆరోగ్యమే మహాభాగ్యమని డాక్టర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. నారాయణ హృదయాలయ, రామకృష్ణారెడ్డి ఫౌండేషన్ హిందూపురం వారి ఆధ్వర్యంలో బేవనహళ్లి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.